క్లుప్తంగా

విలేకరి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



విలేకరి కుటుంబాన్ని ఓదార్చుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ఏలేశ్వరం: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విలేకరి సుంకర సత్యానారాయణ కుటుంబానికి ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ఆర్థిక సహాయం చేశారు. సోమవారం లింగంపర్తిలో విలేకరి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే రూ.లక్ష నగదు అందజేశారు. విలేకరి భార్య పద్మిని, కుమార్తెలు సాయి శ్రీ,జ్ఞానేశ్వరి, తల్లి అప్పలరాజులను ఓదార్చారు. విలేకరి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు చిక్కాల లక్ష్మణరావు, అడపా పార్థసారథి, డేగల వెంకటరమణ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



జగ్గంపేటలో లబ్ధిదారులకు కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

జగ్గంపేట: గత ప్రభుత్వ హయాంలో కొత్త పింఛన్ రావడం గగనమని, ప్రస్తుతం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తున్నట్టు సచివాలయాల మండల కన్వీనర్ బండారు రాజా అన్నారు. జగ్గంపేట సచివాలయ-2లో సోమవారం కొత్త పింఛన్ల పంపిణీని రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, బండారు రాజా ప్రారంభించారు. నూతనంగా మంజూరైన లబ్దిదారులకు పింఛన్లు అందజేశారు. సచివాలయం పరిధిలో 21 మందికి కొత్త పింఛన్లు మంజూరైనట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వసంతకుమార్, పంచాయతీ ఈఓ గణేష్, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని వినతి



తునిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తుని: బేడ, బుడగ జంగాలి కులస్తులకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని సీపీఎం తుని పట్టణశాఖ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తుని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుని నెహ్రూనగర్‌లో 20 ఏళ్లుగా బుడగ జంగాలి కులస్తులు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. వీరికి ప్రభుత్వ పరంగా అందాల్సిన పథకాలు అందడం లేదన్నారు. వీరికి ఇళ్ల స్థలాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. రమేష్, రమణ, యెహోను తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతి

గోకవరం: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గోకవరంలో అర్హులైన వారికి పంచాయతీ పరిధిలోని ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలతకు వినతి పత్రం అందజేశారు. గోకవరంలో సుమారు 600 మందికి తంటికొండకు వెళ్లే మార్గంలో ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేశారన్నారు. మరో 800 మందికి రాజమహేంద్రవరం వెళ్లే మార్గంలోని గంగాలమ్మ ఆలయం సమీపంలో స్థలం మంజూరు చేసినప్పటికీ ఆ స్థలం కోర్టు వివాదంలో ఉండటంతో పట్టాలు పంపిణీ నిలిచి పోయిందన్నారు. తంటికొండకు వెళ్లే మార్గంలో సుమారు 26 ఎకరాల సీలింగ్ భూమి ఉందని, ఈ భూమిని మిగిలిన అర్హులకు పంచేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే ల్యాండ్ సీలింగ్ భూములను గుర్తించి అర్హులకు పంచే విధంగా చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారని ఎంపీపీ తెలిపారు.

వాకర్లకు ఉచిత వైద్య పరీక్షలు



తుని గణపతి నగర్‌లో వాకర్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

తుని: నడక ఆరోగ్యానికి మంచిదని సిటీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి అన్నారు. స్థానిక గణపతినగర్ పార్కులో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు వాకర్స్‌కు ఉచితంగా బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యం విషయంలో అందరూ జాగ్రత్తగా ఉండాలని, తేలిక పాటి ఆహారం తీసుకోవాలని వైద్యులు సూచించారు. ప్రతి నెలా వాకర్స్‌కు చేస్తున్న సేవల్లో పలువురు తమ వంతు సహకారం అందిస్తున్నారని మూర్తి తెలిపారు. పలువురు వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వరిదొడుకులతో సాగుతూ..

- మెట్టలో ముఖం చాటేసిన వరుణుడు
- రైతులకు తప్పని సాగునీటి కష్టాలు
- తాండవలో అంతంతమాత్రంగా నీటి నిల్వలు
- 38,555 ఎకరాల్లో వరిసాగు



కాకరాపల్లిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

కోటనందూరు: మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో గత నాలుగేళ్లుగా రైతులు సాగునీటి కోసం ఎదురు చూడాల్సిన అవసరం రాలేదు. రైతుల అవసరాలకు అనుగుణంగా వరుణుడు కరుణించడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతులు వరిసాగులో అధిక దిగుబడులు చవి చూశారు. ఈ ఏడాది పరిస్థితి దానికి భిన్నంగా మారింది. వరిసాగు ఒడిదుడుకుల మధ్య సాగుతోంది. జులై చివరినాటికి ముగియాల్సిన నాట్లు ఆగస్టు ముగిసినా పూర్తి కాలేదు. తొలకరి పలకరించి మూడు నెలలు కావస్తున్నా.. కనీస స్థాయిలో కూడా వర్షాలు కురవలేదు. సాగునీటి వనరులు సైతం నిండుకున్నాయి. ఆయకట్టు రైతులను ఆపద్బాంధవుడిలా కాపాడే తాండవ జలాశయంలో కూడా నీటి నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఖరీఫ్ ప్రారంభం నాటికే రాష్ట్ర ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సమకూర్చడంతో రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. రైతుల అభ్యర్థన మేరకు తాండవ జలాశయం నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. తాండవ నీరు అందుతున్న పరిధి వరకూ వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. శివారు ప్రాంతాల్లో నాట్లు పడే పరిస్థితి కనిపించడం లేదు. కాగా తాండవ జలాశయంలో ఉన్న నీటి నిల్వలు కేవలం 25 రోజులకు మాత్రమే సాగు అవసరాలకు సరిపోతుందని, వర్షాలు కురవకపోతే ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో నీరు ఇవ్వలేమని ఇప్పటికే తాండవ అధికారులు ప్రకటించారు.

తుని వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో...

మెట్ట ప్రాంతమైన తుని సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఈ ఏడాది 38,555 ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తారని వ్యవసాయాధికారుల అంచనా. కోటనందూరు మండలంలో 9,500 ఎకరాలు, తునిలో 6,500, తొండంగిలో 14,100, రౌతులపూడి 4,718, శంఖవరం 3737 ఎకరాల్లో వరిసాగు జరగనున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. తుని సబ్‌డివిజన్‌లోని ప్రస్తుతం 50 శాతం విస్తీర్ణంలో మాత్రమే నాట్లు వేశారు. మరో 10 రోజుల పాటు వరినాట్లు కొనసాగే అవకాశం ఉంది.

ఖరీఫ్ పెట్టుబడికి ప్రభుత్వ సాయం

గతంలో రైతులు ఖరీఫ్ పెట్టుబడి కోసం ఇంటిలో ఉన్న వస్తువులను తాకట్టు పెట్టడం లేదా దళారులను ఆశ్రయించి పెట్టుబడి సమకూర్చాల్సి పరిస్థితి ఉండేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ దుస్థితి తొలగిపోయింది. రైతు భరోసా పథకం ద్వారా ఏటా పెట్టుబడి సాయం కింద రైతులకు రూ.13,500 అందిస్తున్నారు.

అందుబాటులోకి రైతు భరోసా కేంద్రాలు

గతంలో పంట పొలాలకు భూసార పరీక్షలు పెద్దగా జరిగేవి కావు. ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే విత్తనాల కోసం మండల వ్యవసాయ కార్యాలయం వద్ద రోజుల తరబడి క్యూలైన్లో వేచి ఉండాల్సి వచ్చేది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా భూసార పరీక్షలు, రాయితీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, సలహాలు, సూచనలు, పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర వంటి సౌకర్యాలను రైతు ముంగిటకు తీసుకొచ్చింది. తుని సబ్‌డివిజన్ పరిధిలోని 5 మండల్లాల్లో 98 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి.

తుని సబ్‌డివిజన్ పరిధిలో వరి సాగు వివరాలు

మండలం	వరిసాగు (ఎకరాల్లో)	రైతుభరోసా కేంద్రాలు
కోటనందూరు	9,500	15
తుని	6,500	24
తొండంగి	14,100	26
రౌతులపూడి	4,718	17
శంఖవరం	3,737	16
మెత్తం	38,555	98

వర్షాలు కురవకపోతే ఖరీఫ్ ప్రశ్నార్థకమే



ఈ ఏడాది ఖరీఫ్‌లో వరిసాగు చాలా ఆలస్యమైంది. వర్షాలు కురవక, సాగునీరు లేక రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం తాండవ నీరు ఆధారంగా నాట్లు వేస్తున్నాం. అయితే భారీగా కాస్తున్న ఎండలకు పొలాలు ఎండి పోతున్నాయి. తాండవనీరు కూడా ఎన్ని రోజులు వస్తుందో తెలియదు. వర్షాలు కురవక పోతే వరిపంట ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉంది.

సుర్ల నాగేశ్వరరావు, రైతు, టీజేనగరం

నీటిని పొదుపుగా వాడుకోవాలి

తాండవ జలాశయంలో ప్రస్తుతం 363.3 అడుగుల నీరుంది. ఇది ఆయకట్టు అవసరాలకు 28 రోజులు పాటు సరిపోతుంది. రోజూ ఎడమ ప్రధాన కాలువ ద్వారా 400 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువ ద్వారా 160 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నాం. వర్షాలు కురవకపోతే రైతులకు పూర్తిస్థాయిలో నీరందించే పరిస్థితి కనిపించడం లేదు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి

స్వామినాయుడు, డీఈఈ, తాండవ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఏలేశ్వరంలో ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ఏలేశ్వరంలో గడపగడపకూ మన ప్రభుత్వం

ఏలేశ్వరం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. ఏలేశ్వరం పట్టణంలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులతో కలిసి 3వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 99 శాతం హామీలను అమలు చేశారన్నారు. సచివాలయాల పరిధిలో ప్రభుత్వం అందజేస్తున్న రూ.20 లక్షలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, బదిరెడ్డి గోవింద్, జువ్విన వీర్రాజు, వీరరాఘవమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



తుని సీతారాంపురంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను నిర్ణీత సమయంలోనే పరిష్కరిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 6వ వార్డు సీతారాంపురంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం ఆమె ప్రారంభించారు. ఇటీవల మంత్రి రాజా వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో పలువురు మహిళలు గుంత పడిన రోడ్డుతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందించి రోడ్డు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. అతి తక్కువ వ్యవధిలో సమస్యను పరిష్కరించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని కౌన్సిలర్ సూరిశెట్టి సుభద్రాదేవి అన్నారు. గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణ శాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, పలువురు నాయకులు, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బందిచ వలంటీర్లు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా జెడ్పీటీసీ రాజరాజేశ్వరి



రాజరాజేశ్వరి

ప్రత్తిపాడు: జిల్లా విజిలెన్స్ (సివిల్ సప్లయిస్) కమిటీలో సభ్యురాలిగా ప్రత్తిపాడు జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి నియమితులయ్యారు. ఈ మేరకు కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆమె సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రాజరాజేశ్వరి మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కలిపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా నియమితులైన రాజరాజేశ్వరిని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, గ్రామ ఉప సర్పంచ్ మదినే నూకరాజు, మాజీ సర్పంచ్ శిరసాల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు బుద్దరాజు చంటిరాజు తదితరులు అభినందించారు.

విజిలెన్స్ కమిటీ మెంబర్‌కు సత్కారం



జగ్గంపేట బిందుమాధవిని సత్కరిస్తున్న మహిళలు

జగ్గంపేట: కాకినాడ జిల్లాస్థాయి సివిల్ సప్లయిస్ విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా నియమితులైన జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవిని సోమవారం ఘనంగా సత్కరించారు. జగ్గంపేటలోని ఆమె స్వగృహంలో ప్రజాప్రతినిధులు, అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాల, శాలువాతో సత్కరించారు. జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా తనకు అరుదైన గౌరవాన్ని ఇచ్చారని, ఆ పదవికి న్యాయం చేస్తానని బిందుమాధవి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

కాకినాడ ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత



కాకినాడ జీజీహెచ్‌లో అప్పారావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ అనంతలక్ష్మి

తొండంగి: మండలంలోని కోదాడ పంచాయతీ వాకదారిపేటకు చెందిన ఇద్దరు వృద్ధులకు కాకినాడలో ఆసుపత్రిలో ఆ గ్రామ వలంటీర్ పింఛను అందజేసినట్టు ఎంపీడీఓ పసపులేటి సతీష్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...వాకదారిపేటకు చెందిన పేకేటి అప్పారావు ఊపిరితిత్తుల సమస్యతో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు గ్రామ వలంటీర్ కుక్కా అనంతలక్ష్మి ఆసుపత్రికి వెళ్లి పింఛన్ నగదును అందజేసింది. అదే ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వృద్ధురాలు పేకేటి సత్యవతికి కూడా అనంతలక్ష్మి వృద్ధాప్య పింఛను అందజేసింది.

ఘనంగా గురుపూజోత్సవం



శ్రీప్రకాష్‌లో గురు పూజోత్సవాన్ని ప్రారంభిస్తున్న నరేంద్రబాబు, విజయ్‌ప్రకాష్

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో గురు పూజోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి నరేంద్ర బాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తుని, పాయకరావుపేట, అన్నవరం శాఖలకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి మోడరేటర్‌గా ఉపాధ్యాయుల బోధన ద్వారా విద్యార్థి అభ్యసన సులభతరమా ? సహచర విద్యార్థుల ద్వారా నేర్చుకోవడం సులభతరమా ? అనే అంశంపై నిర్వహించిన చర్చా వేదికలో ఉపాధ్యాయులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు కాలనుగుణంగా తమ జ్ఞానసముపార్జన మెరుగు పరచుకునే దిశగా అడుగులు వేయాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు బృందగాన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు వీరే...



రాజాన ధనలక్ష్మి



సీహెచ్ లక్ష్మీదేవి



పి.రాంబాబు

ప్రత్తిపాడు: విద్యార్థులను ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఆణిముత్యం రాజాన ధనలక్ష్మి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. విజయనగరం జిల్లా గంట్యాడకు చెందిన ధనలక్ష్మి ఉపాధ్యాయ కుటుంబం నుంచి వచ్చిన వారే. ఆమె ప్రత్తిపాడులోని ఆర్‌సీఎం ఎయిడెడ్ పాఠశాలలో 1997 మార్చి 6న ఉపాధ్యాయినిగా చేరారు. అప్పటి నుంచి వృత్తికి మచ్చరాకుండా, విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలు పొందుతూ వచ్చారు. విధి నిర్వహణలో మెరుగైన సేవలు అందించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు.

గండేపల్లి: మండలంలోని మురారి ఎంపీపీ పాఠశాలలో పని చేస్తున్న సీహెచ్.లక్ష్మీదేవి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్టు ఎంఈఓ నాయక్ సోమవారం తెలిపారు. కాకినాడలో మంగళవారం నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవంలో ఆమెకు అవార్డు ప్రదానం చేస్తారన్నారు.

తొండంగి మండలం నుంచి..

తొండంగి: మండలంలోని పాతకోడిపల్లిపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పి.రాంబాబు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్టు ఎంఈఓ షేక్‌బాబ్జి సోమవారం తెలిపారు. రాంబాబుకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా అప్పలరాజు

కిర్లంపూడి: మండలంలోని గోనేడ ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎంగా పని చేస్తున్న సీకోటి అప్పలరాజు మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనట్టు ఎంఈఓ టి.జోసెఫ్ తెలిపారు.


దోషులను శిక్షించాలంటూ ధర్నా

ఏలేశ్వరం: జడ్డంగి అన్నవరంలో దళిత మహిళలపై దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ పట్టణంలో సోమవారం ధర్నా చేశారు. సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యాదర్శి కొసిరెడ్డి గణేశ్వరరావు మాట్లాడుతూ దళిత మహిళపై దాడి చేసి దోషులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

ఏలేశ్వరం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో అధికారులకు సోమవారం టీడీపీ కౌన్సిలర్లు బదిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి వినతి పత్రం సమర్పించారు. పట్టణంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోనాల వెంకటరమణ, యండగండి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం తీరుకు నిరసనగా ఆందోళన



ఏలేశ్వరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం శ్రేణులు

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా పట్టణంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. సీపీఎం మండల కన్వీనర్ పాకలపాటి సోమరాజు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీరుతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ధరల పెరుగదలతో సామాన్యులపై ఆర్థిక భారం పడిందన్నారు. వెంటనే ధరలను నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో మాసా రమణ, రామారావు, బాలరాజు, పుల్లి చిన్నారి పాల్గొన్నారు.

జూదమాడుతున్న ముగ్గురి అరెస్టు

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరంలో జూదమాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపారు. వారి నుంచి రూ.1300 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఎ.మల్లవరం ఉపసర్పంచ్‌గా రాజేశ్వరి



ఎ.మల్లవరం ఉపసర్పంచ్ రాజేశ్వరికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఈఆర్వో అరుణ్‌కుమార్

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం ఉప సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ మద్దతుదారు రొంగలి రాజేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. ఎ.మల్లవరం గ్రామ సచివాలయంలో సోమవారం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. మెజార్టీ సభ్యులు రాజేశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమె ఎన్నికను ఆమోదిస్తూ గ్రామ సర్పంచ్ చిందాడ పెదరాజు, పంచాయితీ వార్డు సభ్యులు సమక్షంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేశ్వరికి ధ్రువీకరణ పత్రం అందజేశారు. తనను ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ నేతలు కాకి నాని, నాకిరెడ్డి అప్పలనాయుడు, సర్పంచ్ పెదరాజుకు రాజేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు.

గులాబీ రంగు పురుగుపై అప్రమత్తంగా ఉండాలి



మాసంపల్లిలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ గాంధీ

శంఖవరం: పత్తి సాగు చేసిన రైతులు గులాబీ రంగు పురుగుపై అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని మాసంపల్లి, జగన్నాథపురం గ్రామాల్లో పత్తి పంటను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంట వేసిన 45 రోజుల్లో గులాబీ రంగు పురుగు ఆశిస్తుందన్నారు. ఇది పువ్వుల్లోని పుప్పొడిని నాశనం చేయడం ద్వారా దిగుబడి తగ్గిపోతుందన్నారు. గులాబీ రంగు పురుగుల నివారణకు రైతులు లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని, వేప కషాయాన్ని పిచకారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు సువర్ణరాజు, రైతులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ మేలు



తుని గవరపేటలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకూ మేలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 23వ వార్డులో సోమవారం కౌన్సిలర్ కర్రి శ్రీదేవి ఆధ్వర్యంలో మన మున్సిపాలిటీ- మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ సుధారాణి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక మహిళలు తాగునీరు, డ్రైన్లు, దోమలు, వీధి దీపాలు తదితర సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆమె కమిషనర్ ప్రసాదరాజుకు సూచించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.